క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో నూతనంగా మంజూరు అయిన సబ్ హెల్త్ సెంటర్ నిర్మాణ స్థలాన్ని మార్చాలని సోమవారం గ్రీవెన్స్‌లో గ్రామస్తులు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. సబ్ హెల్త్ సెంటర్ గ్రామంలోని పశు వైద్యశాల ప్రాంగణంలో నిర్మించాలని ప్రతిపాదన చేశారన్నారు. వర్షాకాలంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పశువులతో అధికంగా ఇక్కడకు వస్తుంటారని ఇక్కడే సబ్ సెంటర్ ఏర్పాటు చేస్తే రోగులు ఇబ్బందులు పడతారన్నారని, పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్మించాలని వినతిలో పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యాసా మునేశ్వరరావు, శ్రీను, సూర్యనారాయణ, వెంకటలాలయ్య, రాంబాబు, వెంకన్న, కృష్ణారావు, మల్లయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ దవాఖానా పనులు అడ్డగింత


కాలనీవాసులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణ

వైరా: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో మంజూరైన పట్టణ దవాఖానా భవన నిర్మాణ పనులను కాలనీ వాసులు సోమవారం అడ్డుకున్నారు. ఎన్‌ఎస్‌పీ కాల్వపై దవాఖానాకు కేటాయించిన ఐదు గుంటల ప్రభుత్వ భూమిలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ రాగా.. ఇది కాలనీ భూమి అంటూ స్థానికులు అడ్డుకున్నారు. దీంతో తహసీల్దార్ అరుణ వచ్చి అందరికీ ఉపయోగపడే దవాఖానాను అడ్డుకోవద్దని సూచించినా వినకపోవడంతో వెనుదిరిగారు. కాగా, కాలనీ వాసుల ఆందోళనకు పీసీసీ సభ్యుడు మాలోత్ రాందాస్‌నాయక్ తదితరులు మద్దతు తెలిపారు.

వలస కూలీ సందీప్‌కు నివాళి

కారేపల్లి: మండలంలోని చీమలపాడులో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా జరిగిన ఘటనలో వలస కూలీ సందీప్ మృతి చెందగా, సోమవారం చీమలపాడులో సంస్మరణ సభ నిర్వహించారు. కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్, సర్పంచ్ మాలోత్ కిషోర్, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు పాల్గొని సందీప్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆతర్వాత అన్నదానం ఏర్పాటుచేశారు.

వీఆర్‌ఏ మృతిపై పలువురి సంతాపం

కొణిజర్ల: మండలంలోని పెద్దమునగాలకు చెందిన వీఆర్‌ఏ షేక్ మహబూబ్‌బీ(60) గుండెపోటుతో సోమవారం మృతి చెందింది. ఆమె మృతదేహం వద్ద తహసీల్దార్ దొడ్డారపు సైదులు, సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు, ఉద్యోగులు, వీఆర్‌ఏలు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

తప్పిన పెను ప్రమాదం

మధిర: పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం లారీ డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో వెంటనే అప్రమత్తమైన స్థానికులు అతనిని గమనించి ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం అతనిని అంబులెన్స్‌లో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లారీ ఎక్కే ముందు ఫిట్స్ రాగా స్థానికులు గుర్తించారు. లారీ డ్రైవింగ్ సమయంలో ఫిట్స్ వచ్చినట్లయితే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభం

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో సోమవారం ఉపాధిహామీ పథకం పనులను సర్పంచ్ మారెళ్ల మమత ప్రారంభించారు. కూలీలతో పాటు సర్పంచ్ మమత పలుగు, పారా పట్టుకొని కొద్దిసేపు కూలీలలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. పని ప్రదేశాల్లో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కూలీ కూడా సరిపడా పడేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వేణు, ఫీల్డ్ అసిస్టెంట్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు..

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారంలో ఉపాధిహామీ కూలీలకు ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మెడికల్ కిట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడగా, ఇమ్మినేని ప్రసాద్, దొడ్డా శ్రీనివాసరావు, కొలగట్ల చెన్నారావు, కొండపల్లి మహేష్, వాడే మల్లేష్, కాకా రామచంద్రరావు, సోయం వెంకటేశ్వరరావు, బెజవాడ మనోజ్, కోటమర్తి మోహన్‌రావు, బండారు జగదీష్, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.


కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దయానంద్

మాట తప్పకుండా నిధులు ఇచ్చాం..

- రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- పెనుబల్లి, కల్లూరులో ఆస్పత్రుల నిర్మాణానికి శంకుస్థాపన
- హాజరైన మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యే సండ్ర, ఎంపీలు


పెనుబల్లిలో ఆస్పత్రి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్, ఎంపీలు నామా, వద్దిరాజు, పార్థసారథిరెడ్డి, కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే సండ్ర


కల్లూరులో ఆస్పత్రి శంకుస్థాపన సందర్భంగా పునాది రాయి వేస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సండ్ర, పక్కన మంత్రి పువ్వాడ

పెనుబల్లి : ఆరు నెలల క్రితం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అభ్యర్థన మేరకు పెనుబల్లి ఆస్పత్రిని పరిశీలించిన సమయంలో ఇచ్చిన మాట ప్రకారం నూతన భవన నిర్మాణానికి రూ.7.5 కోట్లు మంజూరు చేశామని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. పెనుబల్లిలో ఆస్పత్రి భవన నిర్మాణానికి సోమవారం సోమవారం రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే సండ్రతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ సత్తుపల్లిలో రూ.36 కోట్లతో 100 పడకల ఆస్పత్రి, పెనుబల్లి, కల్లూరుల్లో యాభై పడకల ఆస్పత్రులకు రూ.18కోట్లు విడుదల చేశామన్నారు. గతంలో ఎన్నడూ ఒక్క మెడికల్ కాలేజీ రాకపోగా.. ఉమ్మడి జిల్లాల్లోని ఖమ్మం, కొత్తగూడెంకు తాము మెడికల్ కాలేజీ మంజూరు చేశామని తెలిపారు. పేదింటి బిడ్డలు రూ.10 వేలు కడితే ఖమ్మంలో ఎంబీబీఎస్ చదువుకోవచ్చని చెప్పారు. త్వరలోనే గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు కట్టుకునేవారికి రూ.3 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ 1975లో జలగం వెంగళరావు సీఎంగా ఉన్నప్పుడు నిర్మించిన పెనుబల్లి ప్రభుత్వాస్పత్రి నేటి అవసరాలకు సరిపోకపోవడంతో మంత్రి హరీశ్‌రావును కోరగా నూతన భవనానికి నిధులు మంజూరు చేశారన్నారు.

కల్లూరులో ఆస్పత్రి, జలవనరుల శాఖ కార్యాలయానికి శంకుస్థాపన..

కల్లూరు రూరల్: కల్లూరులో ఆస్పత్రి భవన నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఆతర్వాత ఎన్నెస్పీ ఏరియాలో రూ.3.50 కోట్లతో నిర్మించనున్న ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయ భవనానికి కూడా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే సండ్రతో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, డీఎంహెచ్‌ఓ మాలతి, జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సూర్యనారాయణ, జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్, ఎస్‌ఈ ఆనందకుమార్, ఈఈలు లక్ష్మీనారాయణ, అప్పల నాయుడు, రత్నాకర్, పెనుబల్లి ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.రమేష్‌బాబు, జెడ్పీటీసీలు చెక్కిలాల మోహన్‌రావు, కట్టా అజయ్‌కుమార్, ఎంపీపీలు లక్కినేని అలేఖ్య, బీరవెల్లి రఘు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, సర్పంచ్‌లు మందడపు అశోక్‌కుమార్, లక్కినేని నీరజతో పాటు ఎండీ.ఇస్మాయిల్, డాక్టర్ లక్కినేని రఘు, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా నగదు బదిలీ చేయాలని జీఎంపీఎస్ నాయకులు తుశాకుల లింగయ్య, మామిళ్ల వెంకటేశ్వర్లు, భట్టు నర్సింహారావు, తిరుపతిరావు, కృష్ణార్జున్ రావు తదితరులు మంత్రి హరీశ్‌రావుకు వినతి పత్రం అందజేశారు.

గోకినేపల్లిలో రోడ్డెక్కిన రైతులు


గోకినేపల్లిలో వరిధాన్యానికి నిప్పుపెట్టి నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లిలో సోమవారం రైతులు రోడ్డెక్కి ధర్నా చేపట్టారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పది రోజుల నుంచి కొనుగోళ్లు చేపట్టకపోవడంతోనే కేవలం తమ వడ్లు రాసులు తడిచాయని, ఖమ్మం–కోదాడ ప్రధాన రహదారిపై వడ్లు పోసి వరిగడ్డి వేసి నిప్పంటించి నిరసన తెలిపారు. అరగంటపాటు రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. నేలకొండపల్లి, ఖమ్మం రోడ్డుపై వాహనాలు భారీగా నిలిచాయి. జిల్లా అధికారులు వచ్చే వరకు నిరసన ఆపేది లేదని బైఠాయించారు. ముదిగొండ ఎస్సై నరేష్ సంఘటనా స్థలానికి చేరుకొని ఉన్నతాధికారులతో మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి కొనుగోలు చేస్తామని తెలపడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, బాబునాయక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కడవరకు పేదల పక్షాన పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

తల్లాడ: కడవరకు సిద్ధాంతాన్ని వీడకుండా ప్రజల పక్షాన పోరాడిన అప్పారావు ధన్యజీవి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని కేశ్వాపురంలో మన్నేపల్లి అప్పారావు స్మారకార్థం నిర్మించిన స్థూపాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరంనారికొండ అర్జున్‌రావు అధ్యక్షతన జరిగిన సభలో తమ్మినేని మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర్‌రావుతో పాటు బొంతు రాంబాబు, తాతా భాస్కర్‌రావు, అయినాల రామలింగేశ్వర్‌రావు, శీలం సత్యనారాయణరెడ్డి, శీలం ఫకీరమ్మ, నల్లమోతు మోహన్‌రావు, షేక్ మస్తాన్, మన్నేపల్లి రామారావు, సూరంపల్లి గోపాల్‌రావు, పలి వెంకటనరసయ్య, కళ్యాణపు కృష్ణయ్య, దూళ్ల జనార్దన్, అమరేందర్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బీజేపీ విధానాలు..


మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

బోనకల్: బీజేపీ అవలంబిస్తున్న మతతత్వ విధానాలు దేశానికి ప్రమాదకరంగా మారాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు పేర్కొన్నారు. సీపీఎం మండల స్థాయి సమావేశం నోముల పుల్లయ్య అధ్యక్షతన మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేయగా సుదర్శన్‌రావు మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అరాచకాలు సృష్టించి అధికారంలోకి రావడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తుండగా పోరాడుతున్నామని చెప్పారు. కాగా, రానున్న మేడే వేడుకలను గ్రామగ్రామాన నిర్వహించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మధిర నియోజకవర్గం నుంచి సీపీఎం అభ్యర్థి పోటీలో ఉంటారన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుతో పాటు నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, సునీత, వెంకటేశ్వర్లు, లక్ష్మణరారావు, సురేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


అయ్యవారిగూడెంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ సాంబశివరావు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం, మామునూరు గ్రామాల్లో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యాన్ని రైతులు పూర్తిగా ఆరబెట్టుకొని శుభ్రం చేసుకుని నిబంధన ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని తేమ శాతం 17 శాతానికి లోపు ఉన్నట్లు సంబంధిత ఏఈఓ నుంచి సర్టిఫికేట్ తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జి.సుష్మ, సీఈఓ మోహన్‌రావు, సొసైటీ డైరెక్టర్లు మొండ్రు మోక్షం, అనుమోలు కుటుంబరావు, తల్లపురెడ్డి ధనలక్ష్మి, గొల్లపూడి శ్రీహరి నారాయణ, సిబ్బంది మురళీకృష్ణ, తదితరులు ఉన్నారు.

వాడవాడలా బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలి

ఏన్కూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సురేష్ నాయక్ కోరారు. స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మండలస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25న బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామాల్లో జెండా ఎగుర వేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మేడ ధర్మారావు, బానోత్ చందులాల్, పూర్ణకంటి మైసారావు, షేక్ బాజీ, కిషన్‌నాయక్, దుదియా, సుందర్‌రావు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ వితరణ

వైరా: వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ సభ్యుడు డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, వరలక్ష్మి దంపతుల కూతురు అక్షర సిరి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం వైరా చెందిన వి.శ్రావణి అనే మహిళకు కుట్టుమిషన్ వితరణగా అందజేశారు. పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ గౌడ్, జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్‌రావు, కూర శ్రీకాంత్, కిషన్‌రాయ్, రామకృష్ణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో పంచాయతీరాజ్ శాఖ కీలకం

చింతకాని: రాష్ట్రాభివృద్ధిలో పంచాయతీరాజ్ శాఖ కీలకమైందని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కను నాటి కేక్ కట్ చేసి పంచాయతీరాజ్ శాఖ పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్, మినిస్టీరియల్, ఈజీఎస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పతిలో ప్రసవాలు పెరగాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష

ఎర్రుపాలెం: ప్రభుత్వాస్పత్రిలో సాధారణ ప్రసవాలు పెరిగేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ దేవరకొండ శిరీష, జెడ్పీటీసీ శీలం కవిత సూచించారు. మండలంలోని బనిగండ్లపాడు పీహెచ్‌సీలో సోమవారం ఏర్పాటుచేసిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది కొరతను డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. వైద్యులు వెంకటేష్, పుష్పలత, వీరబాబు, శశిపూర్ణ, వెంకటలాల్, సర్పంచ్‌లు పుల్లారెడ్డి, శివాజీతో పాటు అన్నపూర్ణ, అక్కిరెడ్డి, మమత తదితరులు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం.. ఆచూకీ లభ్యం

సత్తుపల్లిటౌన్: ఆడుకుంటూ ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడి ఆచూకీ రెండు గంటల అనంతరం తెలియడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. సత్తుపల్లి ఆర్‌కే ఆస్పత్రి వీధిలో నివాసం ఉంటున్న కేలోతు వీరా పెద్ద కుమారుడు గగన్ సోమవారం రాత్రి ఏడు గంటల సమయాన సైకిల్ తొక్కుకుంటూ బయటకు వెళ్లాడు. ఆతర్వాత రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనగా ఆరా తీస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. చివరకు 8.30 గంటలకు స్థానిక హనుమాన్‌నగర్ పెట్రోల్‌బంక్ వద్ద బాలుడుని గమనించిన స్థానికులు తల్లిదండ్రులకు అప్పగించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

తాగునీటి పైపులైన్ ప్రారంభం

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి అంబేద్కర్‌నగర్‌లో తాగునీటి పైపులైన్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. ఈమేరకు తాగునీటి సరఫరాను సర్పంచ్ కంచర్ల రమాదేవి, ఉపసర్పంచ్ ఏగోటి పెద్దిరాజు సోమవారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పుష్పావతి, దేవరపల్లి సత్యం, కంచర్ల నాగేశ్వరరావు, పరిమి వెంకటేశ్వరరావు, చీకటి చెన్నారావు, కొప్పుల చిన్నస్వామి, నాగార్జున, వెంకటాచారి, హెచ్.హరీష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కప్పల బంధంలో మిల్లు ప్రారంభం

కల్లూరురూరల్: కప్పల బంధంలో యూనియన్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సౌజన్యంతో ఆ గ్రామానికి చెందిన ఎస్‌కె.మహబూబ్బీ లబ్ధిదారురాలికి రూ.4 లక్షలతో మంజూరైన బిస్మిల్లా కారం, పిండిమిల్లును సోమవారం యూనియన్ బ్యాంక్ మేనేజర్ బి.ఆనందభాస్కర్, ఫీల్డ్ ఆఫీసర్ శేషరెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకట్రామారావు, సీసీ వెంకట్రావమ్మ, వెంకటేశ్వర్లు, లక్ష్మి పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై ఫిర్యాదు

సత్తుపల్లిరూరల్: మండలంలోని రామానగరంలో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై పంచాయతీ కార్యదర్శి సోమవారం సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల రోడ్లు, పారిశుద్ధ్య పనులు చేపిస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన కొనపాక వెంకటేశ్వరరావు తన ఇంటి ముందు రోడ్డుపై మట్టి పోయించగా.. అది ప్రమాదకరంగా ఉందని తొలగించాలని కార్యదర్శి చెప్పటంతో ఆయనపై దురుసుగా ప్రవర్తించి చంపుతానని బెదిరించటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నారపునేనిపల్లిలో పశువైద్య శిబిరం

వైరారూరల్: మండలంలోని నారపునేనిపల్లి గ్రామంలో ఖమ్మం పశుగాణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరం విజయవంతమైంది. కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ కిషోర్ పశువుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం 29 గేదెలకు గర్భకోశ వ్యాధి చికిత్స, 33 గేదె, దూడలకు నత్తల నివారణ మందు పంపిణీ, 14 పశువులకు సాధారణ పరీక్షలు నిర్వహించారు. వైరా మండల పశువైద్యాధికారి రాకేష్, సుబ్బారావు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ టి.లక్ష్మణాచారి, ఎం.రాగిణి, బి.లక్ష్మణ్, గోపాలమిత్రులు వి.వెంకయ్య, బి.కృష్ణ, ప్రభాకర్, డి.శేషగిరిరావు, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో నిలిచిన విద్యుత్ సరఫరా


కారేపల్లి: మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి వచ్చిన గాలివాన బీభత్సానికి కారేపల్లిలో విద్యుత్ తీగలు తెగిపడడంతో సరఫరా నిలిచిపోయింది. సోమవారం సైతం విద్యుత్ అధికారులు మరమ్మతులు కొనసాగడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేకపోయారు. కాగా, గాలివానతో కారేపల్లి భారత్‌నగర్, మాధారం, పేరుపల్లిల్లోని పలు ఇళ్ల పైరేకులు ఎగిరిపోగా, గోడలు కూలాయి. అలాగే, పోలంపల్లి బుగ్గవాగు ఆయకట్టులో కోటిలింగాల వద్ద రైతులు సాగు చేసిన వరి పంట నేలమట్టమైంది.

ఈ నెల 26న బస్‌పాస్ మేళా

వైరా: లయన్స్‌క్లబ్ సహకారంతో ఈనెల 26 వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో దివ్యాంగుల కోసం ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు మధిర డిపో మేనేజర్ ఎస్.దేవదానం తెలిపారు. ఈ పాస్‌ల కోసం దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు ఒక ఫొటోతో హాజరుకావాలని సూచించారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవం

సాయిబాబా మందిర..


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కారేపల్లి: కారేపల్లి సాయిబాబా ఆలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఆలయ 24వ వార్షికోత్సవం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగసాయిశర్మ, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొని సత్యసాయి వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సాయిబాబా ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

శ్రీకోదండ రామాలయం..

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలోని శ్రీకోదండ రామాలయం ఐదో వార్షికోత్సవాన్ని సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు సాయి శ్రీధర్ శర్మ రాములోరికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామానికి చెందిన దాత శీలం రామిరెడ్డి రూ.75 వేల విలువ చేసే రెండు వెండి కిరీటాలను స్వామికి బహూకరించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర రెడ్డి, స్థానిక సర్పంచ్ కూరపాటి సుందరమ్మ, ఉప సర్పంచ్ అయిలూరి నాగిరెడ్డి, ఎంపీటీసీ కూరపాటి యశోద, రిటైర్డ్ ఏఈఓ శీలం ప్రతాపరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదిరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఏరియా సేఫ్టీ అధికారిగా వెంకటేశ్వరరావు


మొక్కపాటి వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని కిష్టారం ఓసీ మేనేజర్ పని చేస్తున్న మొక్కపాటి వెంకటేశ్వరరావు కొత్తగూడెం ఏరియా సేఫ్టీ అధికారిగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి కార్యాలయంలో వెంకటేశ్వరరావున ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

నిత్యావసరాలు అందజేత

మధిర: ఆత్కూరు గ్రామంలో నిరుపేద విద్యార్థిని రేణుక కుటుంబానికి సోమవారం మధిర సీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ప్రభుదయాళ్ నిత్యావసర వస్తువులను అందజేశారు. ఆత్కూరు పాఠశాలలో 5వ తరగతి చదువుతూ అత్యంత ప్రతిభ ప్రదర్శిస్తూ పేదరికంతో ఇబ్బంది పడుతున్న ఆ కుటుంబానికి అండగా ఉండేందుకు నిత్యావసరాలు అందించామని ఆయన తెలిపారు.

దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన అధికారులు

ముదిగొండ: ఆదివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న సిమెంట్ రేకుల ఇళ్లను సోమవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మండలంలోని కమలాపురం, అయ్యగారిపల్లి, సువర్ణాపురం, ముదిగొండ గ్రామాల్లో దాదాపు 300 ఇళ్ల వరకు దెబ్బతిన్నాయని, కమలాపురంలోనే 200ఇళ్ల పైగా ఉన్నాయన్నారు. పూర్తిగా నష్టం వాటిల్లితే వాటికి పరిహారం వస్తుందని, పాక్షికంగా దెబ్బతినడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నివేదిస్తామని తహసీల్దార్ శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ

వైరారూరల్: మండలంలోని తాటిపూడి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు సోమవారం ఏడో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని పురస్కరించుకోని స్టీల్ వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భట్టా పెద్దభద్రయ్య, హెచ్‌ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు దొడ్డా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరోనా కలకలం

ఏన్కూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగులు కరోనా బారిన పడ్డారు. దీంతో కార్యాలయ సిబ్బంది, తమ పనులు కోసం వెళ్లే ప్రజలు భయపడుతున్నారు.

'నిరుద్యోగ నిరసన' ర్యాలీకి తరలిన కాంగ్రెస్ శ్రేణులు


కొణిజర్ల నుంచి ర్యాలీగా వెళ్తున్న కార్యకర్తలు

కొణిజర్ల: పరీక్ష పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కొణిజర్ల మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు సోమవారం భారీగా తరలి వెళ్లారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొణిజర్ల సర్పంచ్ సూరంపల్లి రామారావు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా ఖమ్మం తరలి వెళ్లారు.

సమస్యలు పరిష్కరించాలి

గ్రామదీపికల..


ముదిగొండలో గ్రామదీపికలకు మద్దతు తెలిపిన సీఐటీయూ నాయకులు

ముదిగొండ: గ్రామదీపికల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ముదిగొండ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రామ దీపిలక సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామదీపికలతో వెట్టిచాకిరి చేయిస్తుందని అన్నారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా గ్రామదీపికలకు నెలకు 27వేల గౌరవవేతనం ఇవ్వాలని అన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.విష్ణువర్దన్, కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు రమ్య, గ్రామ దీపికల మండల కన్వీనర్ శారద, వేల్పుల భద్రయ్య, గ్రామదీపికలు కవిత, బేగం, కుమారి, పద్మ, నవత, సుభద్ర, సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జేవీఆర్, కిష్టారం ఓసీ కార్మికుల..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీబీజీకేఎస్ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు ఎం.డీ.రజాక్ కోరారు. జేవీఆర్ ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్.వెంకటాచారితో సోమవారం ఆయన సమావేశమై కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూసన వీరభద్రం, రమేష్‌బాబు, మాధవరెడ్డి, జీఎస్‌ఆర్.మూర్తి, మురళీకృష్ణ, కె.చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి..


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఎర్రుపాలెం: మండలంలోని గట్లగౌరారం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామానికి చెందిన కె.వీర వెంకయ్య, నాగేశ్వరరావు, కృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు సోమవారం ఎంపీడీఓ బి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. గత కొన్ని రోజులుగా ఈ సమస్య గ్రామస్తులకు ఇబ్బంది పెడుతున్నప్పటికీ స్థానిక పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని వాపోయారు. విద్యుత్ మోటారు కాలిపోయిందని సమాధానం ఇస్తున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదని ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా నా సమస్య పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎంపీడీఓ సమస్య పరిష్కారం చేస్తామని భరోసా ఇచ్చారు.